క్లుప్తంగా

అక్రమంగా తవ్విన చెరువు మూసేయాలని వినతి

పరవాడ: రసాయన వ్యర్థ జలాలు నిల్వ చేయడానికి తానాం గ్రామాన్ని ఆనుకొని రాంకీ యాజమాన్యం తవ్వకాలు జరిపిన చెరువును వెంటనే మూసివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. తాడిలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోరు వెల్స్‌ను మూసివేయాలని కోరారు.

రోడ్డు స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



ఎంపీడీవో రమేష్ నాయుడుకు ఫిర్యాదు చేస్తున్న గొటివాడ గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని గొటివాడ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను ఆనుకుని ఉన్న రోడ్డును ఇద్దరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన కొంతమంది ఆరోపించారు. దీనిపై మండ పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎంపీడీవో రమేష్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. గతంలో 5 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు వాటిని ఆనుకుని 20 అడుగుల రోడ్డు వేశారని పేర్కొన్నారు. గ్రావెల్ ఫార్మేషన్ చేసేందుకు రూ.20 వేలు మంజూరు చేశారని.. అయితే ప్రస్తుతం ఆ రోడ్డును ఇద్దరు వ్యక్తులు ఆక్రమించి కంచె వేశారని వివరించారు.దీనిపై విచారణ చేపట్టి ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కె. పవన్ కుమార్,ఎ. సురేష్,పి. సూరిఅప్పారావు తదితరులు ఉన్నారు.

మామిడి పండ్లకు గిరాకీ



సీతమ్మధార రైతుబజార్‌లో పరియాలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణంగా ఉగాది మొదటి వారం నుంచి మామిడి పండ్ల(పరియాలు రకం) విక్రయాల మొదలు పెడతారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయంలో, ఇంట్లోని దేవుడి సన్నిధిలో మామిడి పండ్లు ఉంచుతారు. ఈ నేపథ్యంలో పరియాలు రకం పండ్లకు గిరాకీ పెరిగింది. రైతుబజార్‌లో కిలో రూ.90 చొప్పున విక్రయిస్తున్నారు.

విస్తృతంగా వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న పల్లా చంద్రమౌళి

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని క్లబ్ సభ్యులు తీర్మానించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో సోమవారం క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈమేరకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. నెలవారీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. నెలవారీ సమావేశాలను మొదటి శనివారం, కార్యవర్గ సమావేశాన్ని ప్రతి మూడో శనివారం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వహించిన పలు కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, కె.ద్వారకానాథ్, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వ పథకాలు

సీతంపేట: మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ యూసీడీ పీడీ పాపునాయుడు సూచించారు. జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలోని సామాజిక భవనంలో జోన్-5 ఏపీడీ పద్మావతి ఆధ్వర్యంలో సోమవారం డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డ్వాక్రా సంఘాల పనితీరు, బ్యాంకు లింకేజీలు, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, మహిళా సంఘాల పనితీరు, పురోగతి వంటి అంశాలపై సమీక్షించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ జీవీఎంసీ డ్వాక్రా సంఘాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో కొన్నింటిని ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని చెప్పారు.

దంచికొట్టిన వాన



అడవివరంలో కురుస్తున్న వర్షం



పైడితల్లి ఆలయం వద్ద ప్రధాన రహదారిపై పారుతున్న వర్షపు నీరు

పరవాడ: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి పరవాడ, పెదముషిడివాడ తదితర గ్రామాల్లో కాలువలు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారం రాత్రి నుంచి తగ్గు ముఖం పట్టాయని అనుకున్న తరుణంలో మళ్లీ సోమవారం సాయంత్రం ఆకాశం మేఘా వృతమై భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. పలు చెరువుల్లో నీరు చేరింది.

అడవివరంలో భారీ వర్షం

సింహాచలం: అడవివరంలో సోమవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం దాదాపు గంటపాటు దంచికొట్టింది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పైడితల్లి ఆలయం వరకు రోడ్డుపై వర్షపు నీరు జోరుగా పారింది. దీంతో వాహనదారులు కొంతమేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా రోజుల తర్వాత భారీ వర్షం కురవడంతో పలువురు ఆశ్వాదించారు.



పెదముషిడివాడలో కురుస్తున్న వర్షం

ముస్తాబైన నూకాంబిక ఆలయాలు





చాకిరేవుకొండలోని నూకాంబిక అమ్మవారు / పెందుర్తిలోని నూకాంబిక

సింహాచలం: కొత్త అమావాస్య పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల కమిటీలు అమ్మవార్ల ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. 98వ వార్డు పరిధి చాకిరేవు కొండలోని నూకాంబిక ఆలయాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారి విగ్రహంతో పాటు ఆలయానికి నూతన రంగులు వేశారు.

పెందుర్తిలో...

కొత్త అమావాస్యపురస్కరించుకుని 96వవార్డు పెందుర్తిలో వేంజేసిన నూకాంబిక అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వర్తక సంఘం అధ్యక్షుడు ఆళ్ల రామారావు తెలిపారు. ఆలయం వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి విగ్రహాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం రాత్రికి భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గయోపాఖ్యానం యుద్ధం సీను, రామాంజనేయ యుద్ధ సీను, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, కోలాటం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరి పాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

భూసమస్య పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వరహానరసింహం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్యను వెంటనే పరిష్కరించాలని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను జీవీఎంసీ 98వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం వినతి పత్రం అందజేశారు. భూసమస్య పరిష్కారంపై ప్రభుత్వం నియమించిన సలహా కమిటీ సోమవారం అమరావతిలో నిర్వహించిన సమావేశానికి హాజరైన భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో వరహానరసింహం కమిటీ చైర్మన్ కొట్టు సత్యనారాయణను కలిసి భూసమస్యతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. పాత ఇళ్ల మరమ్మతులకు.. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు పునర్నిర్మించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈమేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు వరహా నరసింహం తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లంక సత్తిబాబు, నడింపల్లి రామరాజు, ఎస్.అప్పారావు, మధురెడ్డి, ఎస్.కృష్ణ, కె. సింహాద్రి, అక్కిరెడ్డి శ్రీను, బొట్టా శ్రీనివాస్ ఉన్నారు.

23న దుర్గమాంబ ఆలయ ప్రతిష్ట



బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన దుర్గమాంబ ఆలయం

పరవాడ: ఈ.బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన దుర్గమాంబ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఈ నెల 23న ఘనంగా నిర్వ హించనున్నట్టు సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు చెప్పారు. 22న మధ్యాహ్నం రెండు గంటలకు గణపతి పూజ, అఖండ దీప స్థాపన, పుణ్యాహవచనం, కంకణధారణ జరుగుతుంది. అనంతరం 4 గంటలకు పసిడి కలశాన్ని గ్రామంలో ఊరేగిస్తారు. మరుసటి రోజు గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వృషభ లగ్నసమయమైన ఉదయం 9.57 గంటలకు ఆలయ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని తెలిపా రు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న నవదుర్గా డ్యాన్స్, 23న ఉదయం కలశ ఊరేగింపు కోలాటం ప్రదర్శన ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామని సర్పంచ్ శ్రీనివాసరావు చెప్పారు.

వైభవంగా అప్పన్న కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవ మూర్తులను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెదరాజు తదితరులు క్రతువు నిర్వహించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



రసవత్తంగా ఖోఖో పోటీలు

అగనంపూడి: పరవాడ మండలస్థాయి గ్రామీణ క్రీడా పోటీలు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 85వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా సాగాయి. సోమవారం ఉదయం ఎన్టీపీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హాలు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పరవాడ మండలంలోని 14 ఉన్నత పాఠశాలలకు చెందిన 480 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. బాలురు విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, బాలికలకు కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్టీపీసీ జీజీఎం సిన్హా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏటా ఈ పోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులకు చదువుతో ఆటలు తప్పనిసరన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రుమా డీ శర్మ, డీజీఎం అనితాకుమార్, మేనేజర్ ప్రకాశరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు శేఖర్, కిరణ్, నాగు, మండల ఫిజికల్ డైరెక్టర్లు మోటూరు నాగేశ్వరరావు, పిళ్లా రవిశంకర్, బుడుమూరు అన్నాజీరావు, లోవరాజు, శ్రీదేవి, తులసీ, తదితరులు పాల్గొన్నారు.



పోటాపోటీగా తలపడుతున్న వాలీబాల్ క్రీడాకారులు



కబడ్డీ పోటీల్లో తడాఖా చూపిస్తున్న బాలికలు

వీరవనిత 'మల్లు'



స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

సబ్బవరం: సాయుధ పోరాటంలో పాల్గొని భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు వి. ప్రభావతి అన్నారు. మండలంలోని సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ప్రభావతి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ స్వాముల కుటుంబంలో జన్మించినా తన భూమినంతా పేదల కోసం ధారాదత్తం చేశారన్నారు.పేద ప్రజలకు భూమి ఇప్పించాలని తుపాకీ పట్టుకొని భూస్వాముల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన ధీరవనిత స్వరాజ్యం అని కొనియాడారు. మహిళలకు చట్ట సభల్లో సమాన హక్కు కల్పించాలని అడిగిన మొట్టమొదటి మహిళగా గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, సీఐటీయూ మండల నాయకులు గౌరేష్, వై.రాంబాబు,ఎస్. కృష్ణ, పి.వరలక్ష్మి, కందా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిరసనలు.. వినతులు



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కారం కోరుతూ సోమవారం పలు సంఘాల నాయకులు, ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరసనలు, ధర్నాలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. చదువుకున్న మహిళలకు ఉపాధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం దళిత మహిళా శక్తి సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.మరియమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి బాలయోగి, తదితరులు పాల్గొన్నారు.

జీవో నం-1 రద్దుకు డిమాండ్

జీవో నంబర్ 1ను తక్షణం రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, నాయకులు ఎస్.నారాయణ, ఆర్.పవన్, యు.నాగరాజు, దేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. పంచాయతీల్లో పారిశుధ్యం పనులు చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. ఆరు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

హమాలీల ధర్నా

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయిస్ హమాలీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ హమాలీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పీఎఫ్, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.

కేంద్రం విధానాలు కార్మిక సంక్షేమానికి గొడ్డలిపెట్టు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మిక సంక్షేమానికి గొడ్డలి పెట్టువంటివని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికులమంతా కలిసి ఈ విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలేదీక్షలు సోమవారానికి 767వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎక్స్ సర్వీస్‌మెన్ పాల్గొన్నారు. కార్మికుల నుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే, మౌలిక సదుపాయాల కల్పనలన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేశంలో అభివృద్ధి పూర్తిగా శూన్యమైపోతుందని, అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలి'



పుస్తకం బహూకరిస్తున్న విభాగాధిపతి జాలాది రవి

ఏయూ క్యాంపస్: జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని క్రీడా పరిశోధకుడు, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ అన్నారు. సోమవారం ఏయూ ఎంబీఏ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో 'మాస్టర్ యువర్ లైఫ్'అనే అంశంపై ఆయన మాట్లాడారు. యువత ప్రధానంగా తమ లోని అంతర్గత శక్తిని, సామర్థ్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. నిత్య వ్యాయామం, పుస్తక పఠనం, తగినంత నిద్ర, మంచి ఆహారపు అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ ఆశావాద దృక్పథంతో యువత నడవాలన్నారు. తద్వారా ఉజ్వల భవితను సొంతం చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. అనంతరం కిషోర్‌ను విభాగం తరపున సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు డాక్టర్ శ్రీజ్యోతి సేవలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బయ్య, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా సోమ వారం లలితానగర్ లలితా పీఠంలో కొలువైన కాళీకాలభైరవులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకం జరిపించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమావాస్య సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందని ఆయన తెలిపారు. పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఏయూ ప్రగతిపై పూర్వ విద్యార్థుల హర్షం



వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల 1979-83 బ్యాచ్ విద్యార్థులు సోమవారం వర్సిటీని సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఏయూను నూతన లక్ష్యాల దిశగా నడిపిస్తున్న విధానంపై హర్షం వ్యక్తం చేశారు. వర్తమాన తరం విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానం, విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా తీసుకుంటున్న చర్యలను వీసీ ప్రసాదరెడ్డి వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన హాస్టల్ భవనం నిర్మాణాన్ని వారు పరిశీలించారు.

కరాటే విజేతలకు బహుమతుల ప్రదానం

పెదగంట్యాడ: కరాటే అనేది ఒక యుద్ధ కళ మాత్రమే కాదని, ఆత్మరక్షణకు కూడా ఉపయోగపడుతుందని కరాటే మాస్టర్ నారాయణమూర్తి అన్నారు. శాటికన్ స్పోర్ట్స్ కరాటే డో క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో పెదగంట్యాడకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. వారికి సోమవారం దయాల్‌నగర్‌లో బహుమతులు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతో పాటు చిలకలూరిపేటలోనూ ఆన్‌లైన్‌లో ఈ పోటీలను నిర్వహించారని తెలిపారు.